క్లుప్తంగా...

మే 1 నుంచి నాట్యం, సంగీతంలో శిక్షణ

సనత్‌నగర్: నాట్యశిల్పి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి నాట్యం, సంగీతంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నాట్యాచార్యులు వాసుకీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శివాలయం హాల్లో కూచిపూడి, ఆంధ్రనాట్యం, శివ తాండవం, శాస్త్రీయ నృత్యం, జానపదం, దాండియా, లలిత సంగీతంలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10.30 వరకు కొనసాగుతుందన్నారు. 40 రోజులు కొనసాగే ఉచిత శిక్షణకు హాజరయ్యే బాలబాలికలు ఈ నెల 30 లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటారూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 23, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 15, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 17, కందగడ్డ 40, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

హయ్యర్ పెన్షన్ సదుపాయం వర్తింపజేయాలి



వినతి పత్రం ఇస్తున్న రిటైర్డు ఉద్యోగులు

లాలాపేట: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ సదుపాయాన్ని వర్తింపజేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం ఇండియన్ ఆయిల్ ఎంప్లాయీస్ యూనియన్ సదరన్ రీజియన్ ప్రెసిడెంట్ ఎన్. సుధాకర్‌ను పలువురు రిటైర్డు ఉద్యోగులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీం కోర్టు ఆమోదించిన హైయ్యర్ పెన్షన్ స్కీమ్‌ను రిటైర్డు ఉద్యోగులందరికీ అందించేలా కృషి చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో కొమురయ్య, విజయ్‌కుమార్, రమణారెడ్డి ఉన్నారు.

బాలామృతం ప్యాకెట్ల పంపిణీ



బాలామృతం గురించి వివరిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: బాలామృతంలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని రుద్రవీణ మహిళా సంఘం అధ్యక్షురాలు ఎస్.శోభ అన్నారు. బుధవారం శాస్త్రినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా బాలామృతం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఫీజులు తగ్గించండి



వినోద్‌కుమార్‌కు వినతి ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజును తగ్గించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ వీసీ ప్రొ.రవీందర్‌కు లేఖ రాశారు. బుధవారం ఓయూ పీహెచ్‌డీ విద్యార్థులు మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని వినోద్‌కుమార్‌ను కలిసి ఫీజుల పెంపుపై వివరించి వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన వినోద్‌కుమార్ ఫీజులు తగ్గించాలని వీసీ లేఖ రాసినట్లు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో సత్య, అఖిల్, మహేష్, వెంకట్, శ్రీవాస్తవ, మనోజ్ పాల్గొన్నారు.

వ్యాపార సంస్థలు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు తీసుకోవాలి

కాచిగూడ: వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ సూచించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి కాచిగూడ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి వ్యాపార సంస్థలకు ఫైర్ సేఫ్టీపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎస్ఎస్ తిరుపతి నాయక్, విష్ణు, అమరేశ్వరి, దేవా, శాంతాబాయి, సుజాత తదితరులున్నారు.

క్లీనింగ్‌పై ఫోకస్

- పరిసరాల పరిశుభ్రతపై జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్
- 100 రోజుల కార్యక్రమంలో భాగంగా క్లీన్‌సిటీ దిశగా కసరత్తు
- ప్రత్యేక 10 మంది అధికారుల నియామకం



పరిశుభ్రత పనులు పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారి దయానంద్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత.. చెత్తాచెదారం వ్యర్థాల తొలగింపునకు జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్తాచెదారం లేకుండా చూసేందుకు అధికారులు ఓ కార్యచరణ రూపొందించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 10 మంది అధికారులను నియమించారు. అధికారులు తెల్లవారుజాము నుంచే రోడ్లపైకి వచ్చి చెత్తాచెదారం, వ్యర్థాలు తొలగించే పనిని చూడాల్సి ఉంటుంది. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

గ్లోబల్ సిటీ ఇమేజ్ వైపు..

హైదరాబాద్‌కు దేశంలోని మిగిలిన నగరాల కంటే గ్లోబల్ సిటీ ఇమేజ్ తీసుకురావడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు శ్రమిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు చెత్తా చెదారం, సంచులు, బ్యాగుల్లో తీసుకువచ్చి వాహనంపై వెళ్లేటప్పుడు రోడ్లపై వేసుకుంటూ వెళ్తున్నారు. దీంతో అక్కడ వ్యర్థాలు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్వాసన వస్తోంది. సదరు మార్గాల గుండా రాకపోకలు సాగించే ప్రజలు కంపు వాసనతో ఇబ్బంది పడుతుండటం పరిపాటిగా మారింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి కసరత్తు ప్రారంభించారు.

డివిజన్ ఇన్‌చార్జులు వీరే..
బన్సీలాల్‌పేట్- బి.దయానంద్-(ఏఎంసీ)
మోండా మార్కెట్ - సరిత
బేగంపేట్- శ్రీనివాస్
రాంగోపాల్‌పేట్-నీరజాదేవి(యూసీడీ)

చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి..

ముందుగా ఆయా ప్రాంతాల్లో చెత్తా చెదారం, వ్యర్థాలు వేసే ప్రాంతాలను గుర్తించారు. వీటిని జీవీపీ ఓపెన్ పాయింట్స్ అంటారు. ప్రతి అధికారికి కొన్ని పాయింట్లను అప్పగించారు. ఉదయం 5 గంటల నుంచి 7 వరకు.. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు అధికారులు రోడ్లు, వీధులు, కాలనీల్లోని చెత్తాచెదారాన్ని వాహనాల్లో తరలించాలి. అధికారులు తమకు కేటాయించిన పాయింట్లలో విధులు నిర్వహించే విధంగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీలోని ఆయా విభాగాలకు చెందిన అధికారులను స్పెషల్ డ్రైవ్ కోసం బాధ్యతలను అప్పగించారు. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్లకు 10 మంది చొప్పున అధికారులను నియమించారు. ఒక్కో డివిజన్‌కు ఇద్దరు ఇన్‌చార్జిగా ఉంటారు. ఒకొక్క అధికారికి 10 ప్రాంతాలు కేటాయిస్తారు. ఆయా డివిజన్‌లో చెత్తాచెదారం, వ్యర్థాల తొలగింపు ప్లాస్టిక్ వాడకంపై వీరు ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

అందరిని భాగస్వామ్యం చేస్తూ..

ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఈ స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి చెప్పారు. ప్రజలు, దుకాణాదారులు చెత్తాచెదారాన్ని వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా తమ సిబ్బందికి ఇవ్వాలన్నారు. దీని వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు అనారోగ్యానికి గురికాకురుడా ఉంటారన్నారు. అదే విధంగా ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

మే 4న ఎల్లమ్మ ఆలయ దుకాణాలు ప్రారంభం



ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

- భక్తులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన దుకాణాలను వచ్చే నెల 4న ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఆలయ ఈఓ అన్నపూర్ణ, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, నూతనంగా ఎంపికైన ఆలయ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా ఆలయం వద్ద చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికే ఆ షాపులను ఎలాంటి అద్దె లేకుండా కేటాయించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా నూతనంగా నియమించిన ఆలయ నూతన పాలకవర్గం మే 2న ప్రమాణ స్వీకారం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అనేక దేవాలయాలను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. నగరంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఈ ఆలయం భక్తుల గుర్తింపు పొందిందని ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో 50 వేల మంది వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. భక్తులను ఇబ్బందులకు గురిచేసేలా ఎవరూ వ్యవహరించినా సహించేది లేదన్నారు. ఆలయ కమిటీ సూచించిన ధరల ప్రకారమే ఛార్జీలను వసూలు చేయాలని, అదనంగా వసూలు చేస్తే తక్షణమే వారి కాంట్రాక్టు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నూతన కమిటీ సభ్యులు సుబ్బరాజు, సరాఫ్ సంతోష్, సురేష్‌గౌడ్, నరసింహా, యాదగిరి, రాజారెడ్డి, గౌతమ్‌రెడ్డి, ఆంజనేయులుయాదవ్, ప్రభుగౌడ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బేగంపేట దేవిడిబస్తీలో పర్యటన..

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. బేగంపేట డివిజన్‌లోని దేవిడీ బస్తీలో రూ.27 లక్షల వ్యయంతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే బస్తీలో ఉన్న సీవరేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించామని బస్తీలో అన్ని రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ జీఎం ప్రభు, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రావు, శేఖర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

‘కస్తూర్బానగర్ బస్తీ’ ఇళ్ల సమస్య పరిష్కారానికి సిద్ధమే

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సాక్షి ఎఫెక్ట్..

బన్సీలాల్‌పేట్: కస్తూర్బానగర్ బస్తీ సమస్య పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ నెల 25న ‘సారూ.. మాకు ఇళ్లు ఎప్పుడిస్తారూ’ అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి మంత్రి స్పందించారు. కస్తూర్బానగర్ బస్తీలోని నాయకులు, లబ్ధిదారులు కలిసి వస్తే ఇళ్ల పట్టాలు ఇచ్చి కేటాయించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. స్థానికంగా నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే సమస్య చాలా కాలం నుంచి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అక్కడ పట్టాలు, ఇళ్లు ఎవరికి ఇవ్వాలో.. ఎవరికి ఇవ్వరాదో అనే ఉద్దేశం తనకు లేదని ఎవరూ అర్హులో గుర్తించాల్సిన బాధ్యత బస్తీ వాసులపై ఉందన్నారు. బస్తీ వాసులంతా కలిసి కట్టుగా సమస్య పరిష్కారానికి ముందుకు వస్తే క్షణాల్లో పరిష్కారమవుతుందన్నారు.



మాకు ఇళ్లు ఎప్పుడిస్తారూ!

సాక్షిలో ప్రచురితమైన కథనం

‘మన్‌కీబాత్’ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యకర్తలందరూ కృషి చేయాలని బీజేపీ నాయకులు ఆదం విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం తుకారాంగేట్‌లో ఆయన నివాసంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు అంబాల మహేష్‌గౌడ్ నేతృత్వంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఈ నెల 30న జరిగే మన్‌కీబాత్ 100వ కార్యక్రమాన్ని డివిజన్ పరిధిలోని 20 శక్తి కేంద్రాల వద్ద నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసే దిశగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హంసరాజు, ఉదయ్ యాదవ్, శివాజీ, రాజేష్, సాయిబాబా, దుర్గ ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల తొలగింపు సరికాదు

ముషీరాబాద్: విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల తొలగింపు సరికాదని ఎస్.ఎల్.పద్మ, ప్రవీణ్‌లు అన్నారు. ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాంనగర్ చౌరస్తా వద్ద విద్యుత్ ఆర్టిజన్ 200 మంది కార్మికులను తొలగిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెదిరింపుల ద్వారా విద్యుత్ కార్మికుల సమ్మెను ఆపగలమనుకోవడం అవివేకమన్నారు.

- ఆర్టిజన్ కార్మికులు తమకు వస్తున్న జీతాలు అతి తక్కువ కాబట్టి పర్మినెంట్ వాళ్లకు ఇస్తామన్న 7 శాతం ఫిట్‌మెంట్ కంటే ఎక్కువ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు.
- అన్ని రకాల ప్రయోజనాలకు ఆర్టిజన్ కార్మికులకు కూడా వర్తింపజేయాలని కోరుతూ.. సమ్మె నోటీస్ ఇచ్చి చర్చలు విఫలమైన కారణంగా సమ్మె చేపట్టారన్నారు. విద్యుత్ సంస్కరణ బిల్లు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రవి, లింగంగౌడ్, నల్లన్న, రాందాసు, జయ, భారతి, సావిత్రి, భార్గవి తదితరులున్నారు.



నిరసనలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ నాయకులు



సత్తా చాటిన స్కేటింగ్ టీమ్

మార్చ్‌ఫాస్ట్‌లో సత్తా

సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో అమీర్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్కేటింగ్ టీమ్ సత్తా చాటింది. ప్రారంభోత్సవం సందర్భంగా చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో పాటు కోచ్ పవన్‌కుమార్‌ను జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ విజయలక్ష్మీ అభినందించి అవార్డును ప్రదానం చేశారు.

నేటి నుంచి జాతీయ విద్యా ఫిల్మ్ ఫెస్టివల్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఈ నెల 27 (నేటి) నుంచి 29 వరకు 24వ జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమం జరగనుంది. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఈసీ డైరెక్టర్ ప్రొ.జగత్ భూషన్ నడ్డా ఫిల్మ్ ఫెస్టివల్ వివరాలను వెల్లడించారు. యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నేడు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ శేఖర్ కమ్ముల హాజరవుతారన్నారు. ఈ నెల 29 వరకు ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో విద్యాకు సంబంధించిన చిత్రాల ప్రదర్శన ఉంటుందని ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి రూ.25 వేల వరకు నగదు బహుమతి, ట్రోఫీ అందచేస్తామన్నారు. చిత్రాల ప్రదర్శన సమయం నేటి మధ్నాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 28, 29 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్నాహ్నం ఒంటిగంట వరకు దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో చిత్రాలను ప్రదర్శిస్తారు. చిత్రాలను చూసేందుకు పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు హాజరుకావచ్చని సినిమా చూసేందుకు వచ్చేవారికి ఉచిత భోజన సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం ప్రొ. జగత్ భూషన్ నడ్డాతో పాటు సీఈసీ జేడీ సునీల్ నెహ్రూ, వీసీ ప్రొ.రవీందర్, ప్రొ.మల్లేశం, ప్రొ.మృణాళిణి, రఘుపతిరెడ్డి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

యువతి ఆత్మహత్య

సనత్‌నగర్: తల్లిదండ్రులు తన ప్రేమను నిరాకరించారని మనస్తాపంతో ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ స్వప్న తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం, ఆరెగూడెం, పెద్దకాపల్లి గ్రామానికి చెందిన నిహారిక (18) టెలీకాలర్‌గా పనిచేస్తూ గత నాలుగు నెలలుగా అమీర్‌పేటలోని పద్మావతీ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటుంది. అయితే.. తన స్వగ్రామంలో ఓ యువకుడితో ప్రేమలో పడిన నిహారికను తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపం చెందిన నిహారిక మంగళవారం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

మరో ఘటనలో కూరగాయల వ్యాపారి..

సనత్‌నగర్: ఓ కూరగాయల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.సబ్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు వివరాల ప్రకారం.. సంగారెడ్డి సమీపంలోని కోహిర్ గ్రామానికి చెందిన రవి (28)కి 2017లో షాలినీతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యాపిల్లలతో కలిసి రవి బోరబండ భరత్‌నగర్‌లో ఉంటూ కూరగాయల వ్యాపారం చేస్తుండగా, షాలినీ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తుంది. రవి గత 20 రోజులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. మంగళవారం భార్యకు ఫోన్ చేసి సినిమాకు వెళ్దామని త్వరగా ఇంటికి రావాలని చెప్పాడు. షాలినీ రాత్రి 9 గంటలకు ఇంటికి వచ్చి తలుపు తట్టగా తీయలేదు. అనుమానంతో అక్కడి వారి సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే రవి గత కొంతకాలంగా ఓ మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తుండగా విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో సదరు మహిళ అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన రవి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రవి సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్‌లో గాయపడిన కార్మికుడు మృతి

పద్మారావునగర్: ప్రమాదవశాత్తు లిఫ్ట్‌లో కిందపడి గాయాలకు గురైన ఓ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మహంకాళీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్.ఐ రాంబాబు కథనం ప్రకారం..జనగాం జిల్లా రామచంద్ర తండా ప్రాంతానికి చెందిన భూక్య హుస్సేన్(30) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఆర్పీ రోడ్డులోని దుకాణంలో పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి రాణిగంజ్ మేకలబండ ప్రాంతంలో ఉంటున్నాడు. ఈ నెల 25న దుకాణంలో సామాన్లు తీసుకురావడానికి లిఫ్టులో ఎక్కాడు. అయితే..లిఫ్ట్ ఉన్నట్టుండి కుప్పకూలడంతో భూక్య హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భూక్య గత 10 సంవత్సరాల నుంచి షా ఎంటర్ ప్రైజెస్ షాపులో పని చేస్తున్నాడు. దుకాణం నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే తన భర్త మరణించాడని మృతుడి భార్య భూక్య చిట్టి ఫిర్యాదు మేరకు యజమానులు భరత్ షా, ప్రతీక్ షాలపై కేసు నమోదు చేశామన్నారు.

అన్నార్తుల ఆకలి తీర్చడం అభినందనీయం



ఆర్డీఓ వసంతకుమారిని సన్మానిస్తున్న సభ్యులు

సనత్‌నగర్: శ్రీనివాస సమాజ సేవా సమితి ద్వారా వయోధిక పౌరులు ప్రతిరోజూ ఎంతోమంది ఆకలి తీర్చడం ఎంతో అభినందనీయమని సికింద్రాబాద్ ఆర్డీఓ వసంతకుమారి అన్నారు. బీకేగూడ పార్కు వద్ద కొనసాగుతున్న మధ్యాహ్న మిత భోజన కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి పలువురికి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండుటెండల్లో రాకపోకలు సాగించే బాటసారులు, అన్నార్తులకు ప్రతిరోజూ మిత భోజనం అందించడంతో పాటు వారికి చల్లటి నీటిని అందించడం శుభపరిణామం అన్నారు. ఇక్కడి వయోధికులు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా వయోధికులు చేస్తున్న శ్రమ ఎనలేనిదన్నారు. కాగా బుధవారం నాటి దాతగా తన పుట్టినరోజు సందర్భంగా వెంకటరమణ ముందుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ట్రస్టీ పార్థసారథి, కృష్ణారెడ్డి, విఠల్‌రెడ్డి, ప్రసాద్, జేఎస్‌టీ శాయి, అరవింద్‌గౌడ్, రాజేందర్, సుజాతమ్మ, రజినీరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హనుమంతరావు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ పాలనలో ఎంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్‌లు డిమాండ్ చేశారు. ‘హాథ్‌సే హాథ్ జోడో యాత్ర’లో భాగంగా బుధవారం గోల్నాక డివిజన్ కృష్ణానగర్‌లో వారు మాట్లాడుతూ.. ఏడాదికి రూ.2 కోట్ల ఉద్యోగాలను ఇస్తామన్న ప్రధాని 8 ఏళ్లలో 16 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా.. అని ప్రశ్నించారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కాంగ్రెస్ పార్టీ నేతలు వేణుగోపాల్ స్వామి, రమేష్ బాబు, రోహిణ్‌రెడ్డి, బొల్లు కిషన్, శ్రీకాంత్‌గౌడ్, మహ్మద్ అబ్దుల్ ఫరీద్, రామ్మోహన్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు ఇవ్వాలని వినతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రేషన్ షాపుల్లో నిత్యవసర సరుకులు ఇవ్వాలని కోరుతూ పీవైఎల్, పీఓడబ్ల్యూ ప్రతినిధుల బృందం ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడంతో పాటు సన్నబియ్యం వచ్చేలా చూడాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. గత కొన్ని నెలలుగా సక్రమంగా రేషన్ సరుకులు ఇవ్వకపోవడంతో పేదరికంలో ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచి నూనె, కందిపప్పు, ఉప్పు, కారం, పసుపు, పల్లీలు, పంచదార, గోధుమలు ఇవ్వాలని కోరారు. పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్, పీవోడబ్ల్యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీబాయి, వరలక్ష్మి, నాయకులు రవికుమార్, కృష్ణ, మీనా, సహనాబేగం తదితరులున్నారు.